క్లుప్తంగా

నేడు ఎస్ఎస్ఆర్‌డబ్ల్యూ ఎన్నికలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని షిరిడీహిల్స్‌లో శ్రీసాయి రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్ఎస్ఆర్‌డబ్ల్యూ) ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శి పదవులు దక్కించుకోవడానికి ఇంటింటికీ ప్రచారం చేస్తూ ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

24 మార్కండేయ స్వామి జయంతి

జగద్గిరిగుట్ట: మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకుని ఈనెల 24న జగద్గిరిగుట్ట కొండపై ఉన్న మార్కండేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మంగళవారం రోజు ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, అభిషేకం, అఖండ దీపారాదన అలంకరణ, అర్చన మధ్యాహ్నం భజనలు, కోలాటం, భక్తి పాటలతో స్వామివారి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశిస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అదే విధంగా గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌లోని శ్రీశివ మార్కండేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు రాజశేఖర్ తెలిపారు.

ముంబై మారథాన్‌లో సత్తాచాటిన ఇన్‌స్పెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా ఏటా నిర్వహించే టాటా ముంబయి మారథాన్ పరుగు పందెంలో దాదాపు 56 వేల మంది పాల్గొన్నారు. ఇందులో హైదరాబాద్ డీజీపీ కమాండ్ కంట్రోల్ దయల్-100 ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్రెడ్డి కూడా పాల్గొని... 21.10 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ రన్ను కేవలం గంటా 50 నిమిషాలలో పూర్తి చేశారు. 45 నుంచి 49 వయసు కేటగిరీలో 80వ స్థానం సాధించి మెడల్‌ను కైవసం చేసుకున్నారు. ఇప్పటికి 6 హాఫ్ మారథాన్‌లు, పది 10కె పరుగు పందేలలో పాల్గొని మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, తోటి సిబ్బంది వెంకట్‌రెడ్డిని అభినందించారు.

అవార్డు ప్రదానం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన వెన్న ఈశ్వరప్ప జనకల్యాణ సేవా ధురీణి అవార్డు అందుకున్నారు. అయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను బెంగళూర్‌కు చెందిన జనస్నేహి సంస్థ ఆధ్వర్యంలో బీదర్‌లోని భూమిరెడ్డి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బసవలింగ పట్టదేవరు చేతుల మీదుగా ఈశ్వరప్ప అవార్డు ప్రదానం చేశారు.

అన్నదానం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నెల అమావాస్య రోజు జరిగే ఈ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంపేట్: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణారావు, తహసీల్దార్ సురేందర్‌లతో కలిసి 21 మంది లబ్ధిదారులకు రూ.21,02,437 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శనివారం ఎమ్మెల్యే వివేకానంద్ సమీక్ష నిర్వహించారు. మేయర్ నీలారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలో హెచ్ఆర్డీసీఎల్ ఆధ్వర్యంలో చేపడుతున్న లింక్ రోడ్లు, హెచ్ఎండీఏ చేపడుతున్న భౌరం చెరువు, తుక్క చెరువుల సుందీకరణ పనులపై ఆరా తీసి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం సర్వే నం.342, 329లలో హిందూ శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే శనివారం రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సంజీవరావు, ఈఈ గోవర్ధన్, డీఈఈ రూపాదేవి తదితరులు ఉన్నారు.

నేడు చిత్తారమ్మదేవి ప్రధాన జాతర





హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మదేవి జాతర రెండో రోజు క్రమేణా భక్తుల తాకిడి పెరిగింది. శనివారం గవ్యాంత పూజలు, మూల మంత్ర జపము, ఆవాహియ దేవత హోమాలు, చండీ హోమము, పూర్ణాహుతి, బలి ప్రధానం, పూల గట్టం ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరిగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

◆ ఆదివారం ప్రధాన జాతర జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ పేర్కొన్నారు. ప్రధాన జాతరలో ఉదయం 3 గంటల నుంచి అభిషేకాలు, 4గంటలకు విజయ దర్శనం, తలంబ్రాలతో ఒడి బియ్యం, పూజలు, బోనాలు, మధ్యాహ్నం 3గంటలకు పోతరాజుల నృత్యాలతో వినోద కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

జాతర నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని చిత్తారమ్మదేవి ప్రధాన జాతర నేపథ్యంలో ఆదివారం వాహనాల ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం మీదుగా వెళ్లే వాహనదారులు షాపూర్‌నగర్ డీసీపీ కార్యాలయం పక్కనున్న పైపులైన్ రోడ్డు మీదుగా జగద్గిరిగుట్ట నుంచి కూకట్‌పల్లికి, అదే విధంగా ఉషముళ్లపూడి ఆస్పత్రి వెనుక నుంచి వచ్చే వాహనదారులు అటు నుంచే ఆటో శ్రీనివాస్‌నగర్ వయా జగద్గిరిగుట్ట మీదుగా కూకట్‌పల్లికి వెళ్లాలని, గాజులరామారం మీదుగా ఏ ఒక్క వాహనాన్ని అనుమతించేది లేదని ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. వాహనదారులు నిబంధనలను పాటించి సహకరించాలని కోరారు.

వేషధారణే ఇంటి పేరుగా మారిపోయింది



పోతరాజు దుర్గయ్య

ఆయన పోతరాజు వేషం వేసి డప్పు చప్పుల మధ్య నృత్యం చేస్తే చిన్నారుల నుంచి వృద్ధుడి దాకా చిందు వేయాల్సిందే. ఉగ్ర నరసింహుడిగా అవతారం ఎత్తి కన్నెర్ర చేస్తే ఆమడ దూరం పరిగెత్తాల్సిందే. గాజులరామారం గ్రామానికి చెందిన కంచిగారి దుర్గయ్య చిత్తారమ్మ ఆలయం చిన్నదిగా ఉన్నప్పటి (1976) అమ్మవారి జాతరలో పోతరాజు నృత్యం చేస్తు వస్తున్నాడు. క్రమేణా ఆయన పేరు కంచిగారి దుర్గయ్యకు బదులు పోతరాజు దుర్గయ్యగా మారిపోయింది. శనివారం సాక్షి ఆయన్ని పలకరించగా నగరంలోనే ప్రఖ్యాతి గాంచిన చిత్తరమ్మ జాతరలో ప్రతి ఏటా పోతరాజుగా విన్యాసం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. – సుభాష్‌నగర్

‘కథ కంచికి చేరినట్టు చేరి మళ్లీ మొదలైంది’



బాచుపల్లి సర్వేనం.186లోని డంపింగ్‌యార్డులో వ్యాపిస్తున్న పొగలు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బాచుపల్లి సర్వే నం. 186 డబల్‌బెడ్‌రూమ్ ప్లాట్‌ల సమీపంలోని డంపింగ్‌యార్డ్‌లో మళ్లీ చెత్తను నిప్పు పెట్టడం మొదలైంది. డంపింగ్‌యార్డులో చెత్తను కాల్చడంపై స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో కొన్ని నెలలుగా సేకరించిన చెత్తను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ వస్తున్నారు. కాగా ఇటీవల మరలా చెత్తను డంప్ చేస్తూ రావడంతో శనివారం మరోసారి చెత్తను నిప్పు పెట్టడంతో ఘాటన వాసనలు పొగలతో చుట్టు పక్కల ఉన్న శ్రీసాయినగర్, రాజీవ్‌గృహకల్ప కాలనీ, బండారి లేఅవుట్, జర్నలిస్ట్ కాలనీ, హిల్‌రౌంటీ ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెత్తకు నిప్పు పెట్టడంతో వెలువడే పొగలతో చుట్టు పక్కల కాలనీలు, బస్తీల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని, చెత్తను తరలించడానికి నిధులు ఖర్చవుతున్నాయన్న నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు స్థానికంగానే డంప్ చేయడం దారుణమని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డులో చెలరేగిన పొగలను ఫైర్ ఇంజన్‌ను పిలిపించి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆర్పాలిందిగా బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం సూరారం సీటీ ప్యాలెస్ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కమిటీల నియామకాలను పూర్తి చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, సువారి శ్రీనివాస్, అమర్ బాబు, జేమ్స్, పండరిరావు, గూడ ఐలయ్యగౌడ్, సుజాత ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, గణేష్, వీరేష్ గుప్తా, సంతోష్‌ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, సంపంగి వెంకటేష్ అన్నపూర్ణ, మంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి



కార్మికుల హాజరును పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తరలిస్తూ మున్సిపల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను అయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, స్వచ్ఛ ఆటోల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలన్నారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలు వేయకుండా కట్టడి చేయాలన్నారు. ప్రధాన రోడ్ల స్వీపింగ్ చేసే కార్మికులు తప్పనిసరిగా రేడియం జాకెట్లు, చేతులకు గ్లౌజెస్, మాస్కులు ధరించడంతో పాటు శానిటైజర్లను వాడాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, వరప్రసాద్, జవాన్‌లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆకలిబాధతో విద్యకు దూరం కావొద్దనే మధ్యాహ్న భోజనం పథకం



సుభాష్‌నగర్: ఆకలి బాధతో విద్యకు దూరం కావొద్దనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలతరెడ్డి అన్నారు. శనివారం సూరారం కాలనీలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను కార్పొరేటర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న సరుకులను పరిశీలించారు. అదే విధంగా భోజనం నాణ్యత విషయమై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ భోజనం చేశారు.

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. అదే విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు పరుస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ శంభీపూర్ ఆధ్వర్యంలో సమకూర్చిన నోట్ పుస్తకాలను కార్పొరేటర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జావేద్, ఉపాధ్యాయులు, డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శివాజీ, కార్పొరేటర్ కుమార్తె రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, లక్ష్మి, విజయ్ కుమార్, జహంగీర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఆర్ఐటీ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో డాక్టర్ లవణం అంబాల, కళాశాల సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల 14వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్రో లిమిటెడ్ క్యాంపస్ హైరింగ్ నేషనల్ హెడ్ డాక్టర్ లవణం అంబాల, గౌరవ అతిథిగా హిటాచి వింటారా అక్విసిషన్ టాలెంట్ హెడ్ ప్రశాంత్‌లు హాజరై బీటెక్, ఎంబీఏ, ఎంటెక్ 2018–2022 బ్యాచ్‌లకు చెందిన 1276 మంది విద్యార్థులకు కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావులతో కలిసి పట్టాలు ప్రధానం చేశారు.

◆ ఈ సందర్భంగా డాక్టర్ లవణం అంబాల మాట్లాడుతూ... విద్యార్థులు తమ భవిష్యత్ కోసం నిరంతరం శ్రమిస్తూ తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ఉన్నత స్థానాలను చేసుకోవడానికి కృషి చేయాలన్నారు.

◆ కళాశాల సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... తమ కళాశాలలో ప్రవేశించిన విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో సాంకేతిక విద్యను అందిస్తున్నామని, వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధించే విధంగా తర్ఫీదునిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడుతున్నామని పేర్కొన్నారు.

◆ అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. 2005లో స్థాపించిన తమ కళాశాలను ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అందుకు గాను నాక్ ఏ గ్రేడ్, ఎన్‌బీఏ టైర్-1 సర్టిఫికేషన్ పొందామని పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



కార్మికులకు రూ.1.20 లక్షల నగదును అందజేస్తున్న టీఆర్ఎస్‌కేవీ నేత రవిసింగ్

రంగారెడ్డినగర్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్‌కేవీ పని చేస్తోందని శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. చింతల్‌లోని ఓ షెడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసిన కార్మికులు జోగారావు, శ్రీనివాస్, రాజులకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా షెడ్డు యజమాని పలుమార్లు తిప్పికుంటూ ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో ఈ విషయాన్ని కార్మికులు టీఆర్ఎకేవీ రాష్ట్ర నాయకుడు రవిసింగ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సదరు షెడ్డు యజమానితో చర్చించి కార్మికులకు రూ.1.20 లక్షలు ఇచ్చేలా ఒప్పించి సదరు మొత్తాన్ని శనివారం బాధిత కార్మికులు అందజేశారు. కార్మికులకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, సంతోష్‌గౌడ్, మనోజ్‌కుమార్, అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సహాయం చేసేవారు గొప్పవారు

- బాలానగర్ జోన్ డీసీపీ సందీప్
- మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించిన డీసీపీ



వెస్ట్రో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్‌తో కలిసి బస్సును ప్రారంభిస్తున్న డీసీపీ సందీప్

జీడిమెట్ల: సమాజంలో ప్రజలకు కావాల్సిన అవసరాలు గ్రహించి సహాయం చేసేవారు గొప్పవారని బాలానగర్ జోన్ డీసీపీ సందీప్ అన్నారు. శనివారం జీడిమెట్ల ఫేజ్-5లోని వెస్ట్రో సాల్వెంట్ పరిశ్రమలో ఫ్రీ షటిల్ బస్ ఫర్ ఉమెన్ కార్యక్రమంలో భాగంగా బస్సు సరీ్వసును ప్రారంభించడానికి ఆయన సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) సెక్రటరీ జనరల్ కృష్ణ ఏదుల, కౌన్సిల్ మెంబర్ జ్యోష్న, వెస్ట్రో డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవిలతో కలిసి డీసీపీ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఉచితంగా బస్సుతో పాటు ప్రతినెల రూ.2లక్షలు అందించేందుకు ముందుకు వచ్చిన వెస్ట్రో సాల్వెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, ఆయన కుమారులు హరీష్, కిరణ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్ వెస్ట్రో సంస్థ సిబ్బంది, మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా రాణించేలా ప్రోత్సహించాలి..

ప్రస్తుతం ఉన్న సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమ నైపుణ్యతను చాటాలని, స్త్రీ పాత్ర సమాజంలో చాలా ముఖ్యమైనదని రామసుబ్బారెడ్డి అన్నారు. అలాంటి స్త్రీలు ముందడుగు వేయాలంటే వారికి తగిన వెసలుబాటు కల్పించాలని ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. తాను సంపాదించిన దానిలో కొంతభాగం మహిళల కోసం ఖర్చు చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఉచిత మొబైల్ ట్రీట్‌మెంట్‌తో పాటు మందుల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపడుతానని సుబ్బారెడ్డి తెలిపారు.

బస్సు సర్వీసును మహిళా ఉద్యోగులు సద్వినియోగపరచుకోవాలి..

ప్రతి రోజు ఉచిత బస్సు ఉదయం 8గంటలకు బాలానగర్ నుండి ప్రారంభమై ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్, జీడిమెట్ల, దూలపల్లి, సుచిత్ర బోయిన్‌పల్లి గుండా వచ్చి ఉదయం 9.30నిమిషాలకు బాలానగర్ చేరుతుందని మరలా తిరిగి ఉదయం 9.45గంటలకు బాలానగర్ నుంచి ప్రారంభమై మరలా తిరిగి 11.05కు బాలానగర్ చేరుకుంటుందని ఇలా ఉదయం రెండు ట్రిప్పులు మరలా తిరగి మధ్యాహ్నం 3.30నిమిషాలకు బాలానగర్ నుంచి ప్రారంభమై పైన తెలిపిన ప్రదేశాల నుంచి తిరిగి బాలానగర్ సాయంత్రం 5గంటలకు చేరుకుంటుంది. మరలా సాయంత్రం 5.05నిమిషాలకు బస్సు బాలానగర్ నుంచి బయలుదేరి రాత్రి 7.30గంటలకు బాలానగర్ చేరుతుందని బస్సు నిర్వాహకులు వెస్ట్రో గ్రూప్ సిబ్బంది తెలిపారు. ఉచితంగా సర్వీసును అందించే బస్సును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బస్సులో కూర్చున్న మహిళలు

